క్లుప్తంగా

ఉధృతంగా కుందూ


ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

నంద్యాల(అర్బన్): నంద్యాల సమీపంలో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండటంతో కుందూ నదికి నీటిని అధికంగా విడుదల చేస్తున్నారు. దీంతో నదిలో నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సంబంధిత అధికారులు ఇదివరకే ఆదేశాలు జారీ చేశారు.

మహానందిలో భక్తుల సందడి


క్యూలైన్‌లో ఉన్న భక్తులు

నంద్యాల(అర్బన్): శ్రావణ సోమవారం సందర్భంగా మహానంది క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణ దర్శనం, స్పర్శ దర్శనం, అభిషేకాలకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ అధికారులుభక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మహానందీశుడికి పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మహానందిలో వెలసిన శ్రీకామేశ్వరి, మహానందీశ్వరస్వామి వారికి సోమవారం సాయంత్రం పల్లకీ సేవను చేపట్టారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు అనంతరం విశేషంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రదక్షిణ చేపట్టారు.

గుండెపోటుతో ఫీల్డ్‌అసిస్టెంట్ మృతి


ఉమామహేశ్వరరావు (ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు(56)సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఏపీఓ సోమశేఖర్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. భార్య లక్ష్మీదేవి, కుమారు శంకర్ ఉన్నారు.

210 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఆటోలో అక్రమంగా కర్నూలుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. పట్టణానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి 210 కేజీల రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి కర్నూలులో అధిక రేటుకు విక్రయించడానికి తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. ఆటో, బియ్యాని సీజ్ చేసి సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

డోన్ టౌన్: స్థానిక శ్రీనివాసనగర్‌లోని చర్చి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన సూరిబాబు, మధు, కమాల్‌బాషా, రాజేష్, చంద్రన్నగౌడ్, రంగ, రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్న తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆయనతో పాటు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

కోవెలకుంట్ల: పట్టణంలో జీర్ణోద్ధరణ చేసిన సోమలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. గణపతి, పార్వతి, నంది, నాగ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గోపూజ, గంగానయనం, గణపతిపూజ, స్వస్తివాచనం, మాతృకా పూజ, రక్షాబంధనం, పంచగవ్యమేళన, ప్రోక్షణ, యాగశాల ప్రవేశం, ద్వార పూజ, షడోశ స్తంభ పూజ, సర్వతోభద్ర మండల సహిత గణపతి, శివపార్వతి, ప్రధాన కలశస్థాపన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు బీవీ ప్రసాద రెడ్డి, జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

ప్రత్యేక చట్టాలు అవసరం



ఒక డాక్టర్ కావాలంటే ఎంతో సమయం పడుతుంది. తన విధుల్లో భాగంగా ఓ దేవుడిలా ప్రాణాలను కాపాడతాడు. అలాంటి డాక్టర్లకు రక్షణ లేకపోతే ఎలా? ఏదైనా సంఘటనలు జరిగినప్పుడే కాకుండా మహిళా డాక్టర్లు, నర్సులు, జీఎన్ఎంలు, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలకు రక్షణ కల్పించాలి. వారికి తప్పని సరిగా ప్రత్యేక చట్టాలు అవసరం. ఎందుకంటే భయంతో వైద్యం చేయాలంటే రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడినట్లే.

– డాక్టర్ బాబు, నరసాపురం పీహెచ్‌సీ



రక్షణ కల్పించాలి



వృత్తిరీత్యా ఎంతో మంది మాలాంటి మహిళా డాక్టర్లు ఒంటరిగానే విధులకు రాకపోకలు సాగిస్తుంటాం. వైద్యులకు తప్పని సరిగా రక్షణ అవసరం. ఒక డాక్టర్ కావాలంటే ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుంది. వేలమందికి ప్రాణాలు పోయాల్సిన వైద్యురాలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. పవిత్ర వైద్యవృత్తిని ఎంచుకున్న ట్రైనీ డాక్టర్‌ను అత్యంత పాశవికంగా హత్య చేయడం సరికాదు. పూర్తి స్థాయిలో మహిళా వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి. – డాక్టర్ శ్రావణి, పీహెచ్‌సీ, రుద్రవరం

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో కృతికా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేపట్టారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చిత్తలూరి వీధిలో వెలసిన శ్రీకృష్ణ భజనమందిరంలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితు డు సుదీంద్రాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి స్వామి వారిని వివిధ పూలతో అలంకరించారు. అనంతరం సామూహిక తులసీ అర్చన నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవా చేపట్టారు. చివరగా భక్తుల ఉట్టికొట్టే కార్యక్రమం అలరించింది. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● శ్రీనివాసనగర్‌లోని శ్రీచైతన్య మహాప్రభు మూవ్‌మెంట్ కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం సాయంత్రం నిర్వహించారు. శ్రీకృష్ణ బలభద్ర, సుభద్రకు ప్రత్యేక అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

● పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే శ్రీకృష్ణ భగవానుని మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు పూజలు చేపట్టారు. రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. పార్థసారథి, శివశంకర్, వరప్రసాద్, సుబ్బరాయుడు, పృధ్వీరాజ చంద్రశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో శ్రీకృష్ణ బలరాముల దివ్య దర్శనం, భజన కీర్తనలు నిర్వహించారు. సాయంత్రం గౌర హారతి, శ్రీకృష్ణ బలరాముల మహా శంఖాభిషేకం చేపట్టి మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం భగవద్గీత ప్రవచనాలను వినిపించారు.


చిత్తలూరి వీధిలోని కృష్ణ భజన మందిరంలో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణ భగవానుడు

గోస్పాడు: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారికి అర్చకుడు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాత్రి స్వామి వారి ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ముక్కమల్ల వేణుగోపాల్ రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానందరెడ్డి తెలిపారు.


గాంధీచౌక్‌లో శ్రీకృష్ణ భజన మందిరంలో ఉట్టి కొడుతున్న భక్తులు


శ్రీకృష్ణ ఆలయంలో మంత్రి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డిని సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- వాడవాడలా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు
- చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు
- ఊరేగింపులతో గ్రామాల్లో పండగ సందడి
- ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువకులు

కృష్ణా... ముకుందా..మురారీ!

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా స్వామి వారి చిత్రపటాల ఊరేగింపులతో సోమవారం గ్రామాల్లో సందడి నెలకొంది. చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఊరేగింపులో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యువత శ్రీకృష్ణుడి భక్తిగీతాలకు నృత్యం చేశారు. భజన పాటలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగగా.. సాయంత్రం యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. – ఆళ్లగడ్డ


భారతీ విద్యామందిర్‌లో వేడుకలు


ఉయ్యాలవాడలోని శ్రీవేణుగోపాల ఆశ్రమంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

రుద్రవరం: మండలంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు, విశేష పూజలు గావించారు. హరినగరం సమీపంలోని ఇస్కాన్ టెంపుల్ వద్ద వేడుకలను కోలాహలంగా చేశారు. టెంపుల్ ఇన్‌చార్జ్ చంద్రకేశవదాస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరిగాయి. సాయంత్రం యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. విద్యుద్దీపాలతో వెలుగుతున్న ఇస్కాన్ టెంపుల్ వద్ద శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన భక్తాదుల మధ్య రాత్రంతా హారతి, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలలో ప్రత్యేక వేడుకలు, పూజలు జరిగాయి. యర్రగుంట్లలోని గీతామందిరంలో స్వామి వారికి భక్తులు పూజలు నిర్వహించారు. భజనలు, గీతా పారాయణం, గోపికల నృత్య ప్రదర్శనలు, కోలాటాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

దొర్నిపాడు: మండలంలోని శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని గోకుల క్రిష్టాలయాల్లో ఉదయమే స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.


భక్తజన సందోహం మధ్య వైభవంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ భగవానుడి ఉరేగింపు


దొర్నిపాడులో ప్రత్యేక అలంకరణలో గోకులక్రిష్ణుడు

ఉయ్యాలవాడ: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో భక్తులు అంత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాల ఆశ్రమంలో శ్రీకృష్ణుడికి ఊయల పాన్పుసేవ చేపట్టారు. అలాగే భక్తులు గీతాపారాయణం చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు మహానందిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చాగలమర్రి: మండల కేంద్రంలో మండల హిందూ ఐక్య సంఘం, ఇస్కాన్ ఆలయ బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు పాత బస్టాండ్ సమీపంలోని శివరామనంద ఆశ్రమం నుంచి మెయిన్ బజార్ మీదుగా, చిన్నమకానం నుంచి బసవన్నకట్ట మీదుగా పెద్దమకానం, మెయిన్ బజార్, అమ్మవారిశాల నుంచి శివరామానందస్వామి ఆశ్రమం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహాన్ని అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. చిన్నవంగలి గ్రామ యువతులు, బాలికల కోలాటం అలరించింది.


శ్రీకృష్ణునికి ఊయలు ఊపుతున్న గోపికలు


ఇస్కాన్ టెంపుల్‌లో ఉత్సవమూర్తులకు పూజలు


ఊరేగింపు వెంట యువతుల కోలాటం


ఉట్టి కొట్టిన విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు


దొర్నిపాడులో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో అందరూ కలిసి ఉంటేనే ఆనందంగా ఉంటుందని, ప్రశాంతంగా జీవించాలని, పంతాలకు పోయి కుంటుంబాలను నాశనం చేసుకోవద్దని నంద్యాల తాలూకా సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. మహానంది మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మసీదుపురం, సీతారామాపురం, గోపవరం గ్రామాల ప్రజలతో సోమవారం రాత్రి ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తేవాలని, పిల్లల,ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

ఆ దారిలో ప్రయాణం నరకప్రాయం


కుందూ బ్రిడ్జి సమీపంలో గుంతలమయమైన రహదారి


నంద్యాల(అర్బన్): నంద్యాల నుంచి నందమూరినగర్, రాయమాల్పురం మీదుగా పోలూరు వైపు వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు పడుతున్నారు. అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక వర్షా కాలంలో ఎక్కడ గుంత ఉందో తెలియక కిందపడుతున్నారు. కుందూబ్రిడ్జి నుంచి ఎస్సార్బీసీ సమీపంలోని పెట్రోల్ బంక్ వరకు ఉన్న రహదారిపై మోకాలు లోతు గుంతలుండటంతో అటు వైపు వెళ్లేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా కిందపడి గాయాలపాలవుతున్నారు. రాయమాల్పురం నుంచి పోలూరు వరకు అడుగుకో గుంత..గజానికో గొయ్యిలా ఉండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

గడివేముల: స్థానిక మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో 564 మార్కులు సాధించిన కేవీ వర్షిత ఇటీవల జరిగిన చివరి విడత కౌన్సెలింగ్‌లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన చంద్రుడు, శకుంతలమ్మ దంపతుల కుమార్తె వర్షిత 2023–24 లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. వర్షితను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రసన్న స్వరూపుడు గణపతి

● సామవేదం షణ్ముఖశర్మ


ప్రవచనాన్ని వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్: గణపతి ప్రసన్న స్వరూపుడని, త్వరగా అనుగ్రహిస్తాడు కాబట్టి ఈ స్వామిని క్షిప్ర ప్రసాద గణపతి అంటారని ప్రవచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనం సోమవారం మూడో రోజుకు చేరింది. ముందుగా ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రవచకులు తన ప్రవచనాన్ని వినిపిస్తూ.. పరమేశ్వరుడికి త్రిపురాసుర సంహారం సమయంలో వచ్చిన విఘ్నాలను తీర్చి హేరంబ గణపతిగా పిలవబడ్డారని పురాణాలు చెబుతున్నాయన్నారు. గణేశ పురాణంలో గణపతికి దుర్వాయుగ్మపూజ విశేషంగా చెప్పబడిందని, కేవలం గణపతి నామాన్ని జపించినంతనే ఆయన అనుగ్రహిస్తాడన్నారు. తణపతి అవతారాలలో నర్తన గణపతి రూపం ఎంతో విశేష అవతారమని, ఈ గణపతినే నృత్య గణపతిగా ఆరాధిస్తున్నామన్నారు. శ్రీశైల సంబంధిత గణపతి గాథలను, క్షేత్ర వైభవాన్ని సనాతనధర్మం, వైదిక ఆచారాలకు సంబంధించిన పలు అంశాలను వివరించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ యూపీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టాడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పాత పెన్షన్ విధానం తప్ప ఏ ఇతర ప్రత్యామ్నాయాలను అంగీకరించమని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి రామచంద్రారెడ్డి, శివయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు జాకీర్‌హుసేన్, మధు, నాగార్జున, రాజగోపాల్, హుసేన్, కాశీమయ్య ఏపీటీఎఫ్‌లో చేరారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ఏర్పాట్లను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. పెరిగిన చార్జీలతో సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం గుజరాత్ నుంచి స్మార్ట్ మీటర్లు దిగుమతి చేసుకొని ప్రభుత్వ ఆఫీసులకు, గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి బిగిస్తే ఊరుకునేది లేదన్నారు.

బెలుం గుహలను తిలకించిన కలెక్టర్


గుహను తిలకించేందుకు వెళుతున్న కలెక్టర్ రాజకుమారి

కొలిమిగుండ్ల: సహజ సిద్ధంగా అవతరించి పర్యాటకులను ఆకట్టుకుంటున్న బెలుం గుహల అందాలను జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం తిలకించారు. కలెక్టర్ గుహల వద్దకు చేరుకోగానే గుహల యూనిట్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం గుహ లోపల ఏర్పడిన సహజ సిద్ధ ప్రాంతాలను ఆసక్తిగా తిలకించారు. గుహల ప్రాధాన్యత, ఎప్పుడు ఏర్పడ్డాయి తదితర అంశాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు బస్సుల్లో విహార యాత్రల ద్వారా చారిత్రక ప్రదేశాల గురించి వివరించేందుకు ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ గుహలను పరిశీలించేందుకు వచ్చారు.

ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామికి సోమవారం రాత్రి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణ, నైవేద్య సమర్పణ చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


పల్లకీలో విహరిస్తున్న శివపార్వతులు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామ సమీపంలో ఉన్న గనిలో విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన వెంకట సుబ్బన్న (45) సోమవారం గనిలో పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

అంధ విద్యార్థులకు ఆహారం అందజేత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాల విద్యార్థులకు సీబీటీ నంద్యాల క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం ఆహారం, పండ్లు పంపిణీ చేశారు. ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్టు నంద్యాల జిల్లా ఏఐటీసీసీ ఉమెన్స్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, జయసాలి, పీడీ సుందర్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్లోరి, ప్రశాంతి, ఎస్తేరు రాణి, సుశీల, రోజా, వైస్ ప్రిన్సిపాల్ కనకరాజు పాల్గొన్నారు. అలాగే.. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా క్రిస్టియన్ ప్రీమియర్ లీగల్ సభ్యులు మొక్కలు నాటారు. కారు రవికుమార్ ,డాక్టర్ మనోజ్‌కుమార్, అబ్రహాం, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ చెస్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద ఆడిటోరియంలో సీనియర్ ఓపెన్ బాలికల నంద్యాల జిల్లా చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, క్రీడా భారతి కార్యదర్శి సుధాకర్, నాగరాజు, ఎల్లయ్య ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో జిల్లాలోని 200 మంది పాల్గొన్నట్లు డాక్టర్ రవికృష్ణ తెలిపారు.